సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 14 । జూన్ । 2024



మద్యం మత్తులో వ్యక్తి హత్య

తణుకు మండలం దువ్వ గ్రామంలో ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద మద్యం మత్తులో జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. 8లో ▸



సేంద్రియ సాగు మేలు

రసాయన మందుల వాడకం తగ్గించి సేంద్రియ పద్ధతుల్లో సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. 8లో ▸



రక్తదానం.. మహోన్నతం

రక్తదానం ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. తరచూ రక్తదానం చేస్తూ పలువురు ఆదర్శంగా నిలుస్తున్నారు. రక్తదాన దినోత్సవం సందర్భంగా కథనం.. 8లో ▸

న్యూస్‌రీల్

స్టూడెంట్ కిట్ల పంపిణీ వేగిరపర్చండి



కోపల్లె జిల్లా పరిషత్ హై స్కూల్‌లో మొక్కలు నాటుతున్న ఆర్‌జేడీ నాగమణి

కాళ్ల: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో పంపిణీ చేయాలని అందించాలని ఆర్‌జేడీ జి.నాగమణి ఆదేశించారు. కోపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్టూడెంట్ కిట్‌ల స్టాక్ పాయింట్‌ను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పాఠశాలకు స్టూడెంట్ కిట్లను శనివారంలోగా పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. అదేవిధంగా పాఠశాలలో అడ్మిషన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఇష్టపడి చదవాలని, ఉపాధ్యాయుల సూచనల మేరకు మంచి మార్కులు సాధించాలని సూచించారు. పర్యావరణ దినోత్సవం కార్యక్రమాల్లో భాగంగా పాఠశాల ఆవరణలో ఆర్‌జేడీ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రవీంద్ర, పాఠశాల ఉపాధ్యాయులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

20న అరుణాచల యాత్రకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అరుణాచల గిరి ప్రదక్షిణ యాత్రకు గూడెం డిపో నుంచి ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు ఆర్టీసీ తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి చెప్పారు. గురువారం డిపో వద్ద ఆయన మాట్లాడుతూ అరుణాచల గిరి ప్రదక్షిణ బస్సు ఈ నెల 20వ తేదీన రాత్రి 7 గంటలకు గూడెం బస్‌స్టేషన్ నుంచి బయలుదేరుతుందన్నారు. సూపర్ లగ్జరీ వీడియో కోచ్ బస్సు 21వ తేదీ ఉదయం శ్రీకాళహస్తి, అనంతరం కాణిపాక విఘ్నేశ్వర స్వామి క్షేత్రం, అదే రోజు రాత్రి శ్రీపురం శ్రీమహాలక్ష్మి గోల్డెన్ టెంపుల్ దర్శనం, 22వ తేదీ తెల్లవారుజామున రెండు గంటలకు అరుణాచలం చేరుతుందని వెల్లడించారు. గిరి ప్రదక్షిణ, స్వామి వారి దర్శనం అనంతరం అదే రోజు సాయంత్రం తిరుగు ప్రయాణం ప్రారంభమై, 23వ తేదీన తాడేపల్లిగూడెం చేరుకుంటుందని చెప్పారు. చార్జి కేవలం రూ.2,600 మాత్రమేనని, ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 99592 25488, 99597 53102 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

15న భీమవరంలో ఆర్చరీ జిల్లా పోటీలు

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎల్.జయరాజు గురువారం చెప్పారు. భీమవరం వంశీనగర్‌లోని ఓల్గా ఆర్చరీ అకాడమిలో ఈనెల 15న నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాల రెండు జతల జిరాక్స్ కాపీలు, మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలను వెంట తీసుకురావాలన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 22 నుంచి మూడు రోజులపాటు విజయవాడలో నిర్వహించే బాయ్స్ అండ్ గరల్స్ అండర్-10, 13, 15 పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధిస్తారని జయరాజు తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఓల్గా ఆర్చరీ అకాడమీ కోచ్ ఇ.సాహిత్, 98491 81993 సెల్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి



మంత్రి నిమ్మల, ఎమ్మెల్యే బొలిశెట్టి, బబ్జిని గజమాలతో సత్కరించిన దృశ్యం

తాడేపల్లిగూడెం: వరి, ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. గురువారం తాడేపల్లిగూడెంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ను ఆయన కలిశారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ కోసం కూటమి కలిసికట్టుగా పనిచేస్తుందన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టికి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ అందరి సహకారంతో ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ వలవల బాబ్జీ, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ ఉన్నారు.

స్మార్ట్‌గా చిదిమేస్తోంది

మా బాబుకు ఇంకా రెండేళ్లయినా లేవు.. స్మార్ట్ ఫోన్‌లో అన్ని చకచకా ఓపెన్ చేసేస్తాడు.. అంటూ ఒకరు, మావాడైతే మరీనూ.. అంటూ మరొకరు చెప్పుకుని తల్లిదండ్రులు మురిసిపోతుండటం చూస్తుంటాం. అయితే ఇటువంటి పరిస్థితి వల్ల పొంచి ఉన్న ప్రమాదాన్ని ముందుగానే గుర్తించమని సూచిస్తున్నారు మానసిక వైద్యనిపుణులు. ఓ సర్వే ప్రకారం ప్రతి 50 మంది చిన్నారుల్లో ఒకరు ఆటిజం, ఏడీహెచ్‌టీ డిజార్డర్లతో బాధపడుతున్నట్టు వెల్లడైంది. మరోపక్క స్మార్ట్ ఫోన్‌కు **బానిసైన యువతలో గేమింగ్ డిజార్డర్, ఇంటర్నెట్ అడిక్షన్స్** వారి వ్యక్తిత్వ, మానసిక వికాసాన్ని **దెబ్బతీస్తున్నాయని హెచ్చరిస్తున్నారు.**





- స్మార్ట్ ఫోన్ల మాయలో చిన్నారులు, యువత
- మానసిక, వ్యక్తిత్వ వికాసంపై తీవ్ర ప్రభావం
- ప్రతి 50 మందిలో ఒకరికి ఆటిజం, ఏడీహెచ్‌టీ డిజార్డర్లు
- యువతలో గేమింగ్ డిజార్డర్, ఇంటర్నెట్ అడిక్షన్స్
- మానసిక వైద్యుల వద్దకు క్యూకడుతున్న బాధితులు
- తల్లిదండ్రులు ముందే గుర్తించాలంటున్న నిపుణులు

సాక్షి, భీమవరం: స్మార్ట్ ఫోన్ చేతిలో ఉందంటే **చాలు** ప్రపంచం మొత్తం గుప్పెట్లో ఉన్నట్టే అనడం అతిశయోక్తికాదు. ఇంటర్నెట్, వాట్సాప్, ఫేస్ బుక్, ఆన్‌లైన్ షాపింగ్.. ఏదైనా స్మార్ట్ ఫోన్‌తోనే. మొదట్లో సంపన్నులు స్టేటస్ సింబల్‌గా భావించిన స్మార్ట్ ఫోన్ నేడు అందరికీ అందుబాటులోకి వచ్చింది. తక్కువ ధరల్లోనూ ఈ ఫోన్లు లభ్యమవుతుండటంతో అన్ని వర్గాల వారు వీటిని ఉపయోగిస్తున్నారు. వీటిలో ఆన్‌లైన్ గేమింగ్ సదుపాయం ఉండటంతో చిన్నారులు, యువత ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో ఇంటి వద్దనే ఉంటూ కాలక్షేపం కోసం పెద్దలు, ఆన్‌లైన్ పాఠాల కోసం చిన్నారుల్లో వీటి వినియోగం మరింత పెరిగింది.

ఉపయోగాలు ఎన్నో..

స్మార్ట్ ఫోన్‌ను మొదట్లో కేవలం లగ్జరీ వస్తువుగా భావించేవారు. కానీ నేడు దానివల్ల అనేక ఉపయోగాలు ఏర్పడ్డాయి. ఇంటర్ నెట్‌ను అనుసంధానంతో యువతకు ఇది చాలా ఉపయోగకరంగా ఉంటోంది. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలను వెతుక్కునేందుకు, ఇంటర్వ్యూలు వంటి వాటికి హాజరయ్యే **సమయంలో ప్రపంచంలో ఉన్న అనేక విషయా**లను తెలుసుకునేందుకు ఉపయోగపడుతుంది. యువతుల భద్రతకు అనేక అప్లికేషన్లు స్మార్ట్ ఫోన్ ద్వారా పనిచేస్తుండడంతో వారికి భరోసా దొరుకుతోంది. చేరాలనుకునే చోటును జీపీఆర్ఎస్ ద్వారా తెలుసుకోగలడం, అక్కడకు త్వరగా చేరడానికి వీలు కలుగుతోంది. వీడియో కాలింగ్ ద్వారా ప్రత్యక్ష పరిస్థితులను తెలుసుకునే వీలు కలిగింది. ఇలా అనేక ప్రయోజనాలను స్మార్ట్ ఫోన్లు అందిస్తున్నాయి.

అనర్థాలూ అనేకం : స్మార్ట్ ఫోన్లు అతి వినియోగం ద్వారా అనర్థాలూ అనేకం ఉన్నాయి. వైఫై, టెలికం కంపెనీల అన్‌లిమిటెడ్ డేటా ఆఫర్లతో వీటి వినియోగం బాగా పెరిగిపోయింది. ప్రధానంగా చిన్నారులు, యువతపై వీటి ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. సహజంగా ఉండే మానవ సంబంధాలకు విఘాతం కలుగుతోందని నిపుణులు అంటున్నారు. ఇంట్లో కుటుంబ సభ్యులందరూ ఉన్న పట్టించుకోకుండా ఎవరికి వారు గేమ్స్ ఆడుతూనో, చాటింగ్ చేస్తూ ఉండిపోతుండటంతో వారి మధ్య ప్రేమానురాగాలు తగ్గిపోతున్నాయి. ఇంటికి బంధువులు వచ్చినప్పుడు వారితో గడపాల్సిన సమయం కూడా స్మార్ట్ ఫోన్లు ఆక్రమించేస్తున్నాయి. ఎదురుగా ఉన్న స్నేహితులతో గడపాల్సిన, చదువుకోవాల్సిన సమయాన్ని ఇవి హైజాక్ చేసేస్తున్నాయి.

చిన్నారులపై చెడు ప్రభావం

తమ పనికి ఆటంకం కలిగించరనే ఉద్దేశంతో పిల్లల చేతిలో స్మార్ట్ ఫోన్లు పెడుతున్న తల్లిదండ్రుల సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. కాలక్రమంలో పిల్లలకు వ్యసనంగా మారి చేతిలో ఫోన్ ఉంటేనే గాని ఏ పనిచేయలేని స్థితిలోకి వారిని నెట్టేస్తోంది. చిన్నారుల్లో ఏడాది వయస్సు నుంచి మొదలయ్యే డెవలప్‌మెంట్ పీరియడ్‌పై ఫోన్లు తీవ్ర ప్రభావం చూపుతున్నాయని వైద్యనిపుణులు చెబుతున్నారు. చుట్టుపక్కల పరిసరాలు, వాతావరణాన్ని గమనించకుండా వారు ఫోన్‌లోని వీడియోలు, బొమ్మలపై లీనమైపోవడం వలన మాటలు రావడం ఆలస్యమవుతుందని, వేరే పిల్లలతో కలవకపోవడం, హావభావాలు వ్యక్తం చేయకపోవడం వంటి ఆటిజం లక్షణాలు కనిపిస్తాయంటున్నారు. 1990వ దశకంలో 10 వేల మందిలో ఒకరు మాత్రమే ఆటిజం సమస్యతో బాధపడేవారు. స్మార్ట్ ఫోన్ల ప్రభావంతో ప్రస్తుతం 50 మందిలో ఒకరు ఈ సమస్యతో బాధపడుతున్నట్టు వివరిస్తున్నారు. ఈ సమస్యతో బాధపడుతున్న చిన్నారుల్లో వయస్సుకు తగ్గట్టుగా బ్రెయిన్ డెవలప్‌మెంట్ ఉండదని, 70 శాతం పిల్లల్లో బుద్ధి మాంద్యం కనిపిస్తోందంటున్నారు. దీంతోపాటు స్మార్ట్ ఫోన్ ఎక్కువగా చూసే చిన్నారుల్లో ఏడీహెచ్‌సీ (అటెన్షన్ డిఫిసిటీ హైపర్ కెనిటిక్) డిజార్డర్ వచ్చి ఏ పనిపై దృష్టి సారించలేరని, మతిమరుపు సమస్య వస్తుందని, చెప్పినమాట వినకుండా ఒక్కోసారి క్రూరంగా మారిపోతుంటారని వివరిస్తున్నారు.

కేసులు బాగా పెరిగాయి



స్మార్ట్ ఫోన్ల ప్రభావంతో అనారోగ్య సంబంధిత కేసులు ఇటీవల కాలంలో బాగా **పెరిగాయి. చిన్నారుల్లో ముఖ్యంగా ఆటిజం** డిజార్డర్, ఏడీహెచ్‌సీ, యువతలో **గేమింగ్ డిజార్డర్ కనిపిస్తున్నాయి. గతంలో వా**రానికో నెలకో ఒక కేసు వస్తే ఇప్పుడు **రోజూ ఇటువంటి కేసులు వస్తున్నాయి. తల్లి**దండ్రులు తమ పిల్లలకు ఫోన్లను వీలైనంత తక్కువ **సమయం అలవాటు చేయాలి. వీలైనంత త్వ**రగా ఆటిజంను గుర్తించి చికిత్స ప్రారంభించాలి.

– డాక్టర్ జీవీ రమణరావు, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు, శాంతి ఆస్పత్రి, భీమవరం

యువతకు వ్యసనంగా.. మనిషి సగటున రోజుకు 7, 8 గంటలైనా నిద్రపోవాలి. అయితే గంటల తరబడి గేమ్స్ ఆడడం, ఇంటర్‌నెట్‌ను బ్రౌజ్ చేయడం వల్ల యువత నిద్ర సమయం తగ్గి తీవ్ర మానసిక ఒత్తిడికి, అనారోగ్యానికి గురవుతున్నట్టు సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. అశ్లీల వీడియోలు చూసే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. తిండి, నిద్రలేకుండా ఆన్‌లైన్ గేములు ఆడుతున్న వారిలో ఇంటర్నెట్ అడిక్షన్, ఆన్‌లైన్ గేమింగ్ డిజార్డర్ ఎక్కువగా కనిపిస్తున్నాయి. స్మోకింగ్, బెట్టింగ్, గాంబ్లింగ్ డిజార్డర్ల బారిన పడి తమ భవిష్యత్తును పాడుచేసుకుంటున్నారని నిపుణులు అంటున్నారు. ఆయా సమస్యలతో మానసిక వైద్యులను సంప్రదిస్తున్న వారి సంఖ్య పెరిగిందని చెబుతున్నారు. చిన్నారులకు స్మార్ట్ ఫోన్‌లు దూరంగా ఉంచడంతో పాటు ఆయా లక్షణాలు గుర్తిస్తే వెంటనే అవసరమైన వైద్యసాయం అందించడం ద్వారా నయం చేయవచ్చునని సూచిస్తున్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

నేతలకు స్పష్టం చేసిన వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్



వైఎస్ జగన్‌ని కలిసిన ఎమ్మెల్సీ కవురు, ఆనందప్రకాష్, గోవిందరాజుల నాయుడు, డీటీడీసీ బాబు

పాలకొల్లు అర్బన్: ధైర్యంగా ఉండాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలపై స్పందించాలని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకు సూచనలు చేసినట్లు ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ చెప్పారు. పాలకొల్లు నుంచి ఎమ్మెల్సీతో పాటు రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్, జెడ్పీటీసీ సభ్యులు నడపన గోవిందరాజుల నాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ పెన్మెత్స వెంకట సూర్యనారాయణరాజు గురువారం మాజీ సీఎం వైఎస్ జగన్‌ను విజయవాడలలో కలిసినట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై అధికార పార్టీ నేతలు దాడులకు పాల్పడుతున్నారన్నారు. దాడుల్లో గాయపడ్డ బాధితులకు అండగా నిలవాలని, వారికి మనోధైర్యాన్ని ఇవ్వాలని కోరారు. త్వరలో జిల్లాల పర్యటనలు చేయనున్నట్లు, అధికార పార్టీ నేతల దాడుల్లో గాయపడ్డ ప్రతి కార్యకర్తను పరామర్శిస్తానని వివరించినట్లు ఎమ్మెల్సీ శ్రీనివాస్ చెప్పారు.

దళితులపై దాడులను సహించం

ఏలూరు (మెట్రో): దళితులపై దాడులు చేస్తే సహించేది లేదని ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనంద్‌ప్రకాష్ అన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం కలిసి రాష్ట్రంలో జరుగుతున్న దాడులపై ఆనంద్ ప్రకాష్ చర్చించారు. బడుగు బలహీన వర్గాలు, దళితులు వైఎస్సార్‌సీపీకి అండగా ఉన్నారని, వారిపై దాడులు జరిగితే కమిషన్ నిబంధనలు ప్రకారం చర్యలు తీసుకోవాలని మాజీ ముఖ్యమంత్రి జగన్ సూచించారు. దీనిపై, రాష్ట్ర స్థితిగతులపై చర్చించిన అనంతరం ఏలూరు చేరుకున్న ఆనంద్ ప్రకాష్ మీడియాతో మాట్లాడారు. దళితులపై దాడులు జరిగితే చట్టప్రకారం చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. గత కొద్ది రోజులుగా టీడీపీ కార్యకర్తలు దళితులు, వెనుకబడిన వర్గాలపైనే దాడులు చేస్తున్నారన్నారు. ఇప్పటికే జాతీయ ఎస్సీ కమిషన్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లామని ఆయన చెప్పారు. నిబంధనల మేరకు ఎస్సీ కమిషన్ స్పందించి బాధితులకు అండగా నిలవడంతో పాటుగా దాడులకు తెగబడిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని ఆనంద్‌ప్రకాష్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

ధ్వంస రచనకు బాధ్యులు ఎవరు?

- మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ
- జగ్గన్నపేటలో ధ్వంసం చేసిన సచివాలయ శిలాఫలకాల పరిశీలన



జగ్గన్నపేటలో ధ్వంసం చేసిన శిలాఫలకాలను పరిశీలిస్తున్న కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: సచివాలయ భవనాల వద్ద శంకుస్థాపన, ప్రారంభోత్సవ శిలాఫలకాల ధ్వంస రచనకు బాధ్యులు ఎవరని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రశ్నించారు. గురువారం మండలంలోని జగ్గన్నపేట సచివాలయం వద్ద ధ్వంసం చేసిన శంకుస్థాపన, ప్రారంభోత్సవ శిలాఫలకాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షపూరిత చర్యలను ప్రోత్సహిస్తూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఇటువంటి దాడులకు పాల్పడటం దారుణమన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై వారికి గౌరవం లేదన్నారు. ధ్వంస రచన వెనుక చంద్రబాబు, పవన్, పురందేశ్వరి ఉన్నారా? అని నిలదీశారు. పరిపాలనను గ్రామ స్థాయికి తీసుకువచ్చి అభివృద్ధి చేశామని, అటువంటి ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే ఈ ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటుందా? అని ప్రశ్నించారు. దీనికి సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే జవాబు చెప్పాలన్నారు. ధ్వంస రచన వీడియోలను రాష్ట్రపతి, ప్రధాని, హెచ్‌ఆర్‌సీ, సుప్రీంకోర్టు, హైకోర్టు చీఫ్ జస్టిస్ దృష్టికి తీసుకెళతామన్నారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, ములకాల రాంబాబు, బొల్లం నాగసుబ్బరాజు, పచ్చా అంజిబాబు, పచ్చా లక్ష్మణరావు, ములకాల పెద్దిరాజు, కాటుబోయిన సుబ్బారావు, ములకాల వినాయకుడు, కాసాని వినాయక్ ఉన్నారు.

శిలాఫలకాల ధ్వంసంపై కేసుల నమోదు

జగ్గన్నపేట, రామన్నగూడెం గ్రామ సచివాలయాల వద్ద శంకుస్థాపన, ప్రారంభోత్సవ శిలాఫలకాలు ధ్వంసం ఘటనపై ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై సురేష్ గురువారం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● మోగిన బడి గంట



పెదతాడేపల్లిలో విద్యార్థులను పాఠశాలలోకి ఆహ్వానిస్తున్న ఉపాధ్యాయులు

వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు విద్యార్థులతో సందడిగా మారాయి. కాగా తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూలులో విద్యార్థులు తరగతి గదుల గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టడంతో పండగ వాతావరణాన్ని తలపించింది. అలాగే ఉపాధ్యాయులందరూ విద్యార్థులకు స్వాగతం పలకడంతో ఉత్సాహంగా తరగతులకు హాజరయ్యారు. - తాడేపల్లిగూడెం రూరల్



పెదతాడేపల్లి హైస్కూల్‌లో తరగతి గదులకు మామిడి తోరణాలు కడుతున్న విద్యార్థులు

29న జాతీయ లోక్ అదాలత్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కె.రత్నప్రసాద్, ఎ.మేరీగ్రేస్ కుమారి

ఏలూరు (టూటౌన్): జాతీయ న్యాయసేవాధికార సంస్థ న్యూఢిల్లీ వారి ఆదేశాల మేరకు జూన్ 29న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీగ్రేస్ కుమారి, డీఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్ చెప్పారు. స్థానిక జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్‌పర్సన్ మేరీ గ్రేస్ కుమారి మాట్లాడుతూ జూన్ 29న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ ద్వారా రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్, వాహన ప్రమాద కేసులు, కుటుంబ వివాదాలు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంకు లావాదేవీల కేసులు, శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్, ట్రాన్స్‌పోర్టు ఫైనాన్సులకు సంబంధించిన ఈపీలను, ప్రీలిటిగేషన్ కేసులను రాజీ చేసుకునే అవకాశం ఉందన్నారు. రాజీయోగ్యమైన కేసులకు ఇరుపక్షాలకు మధ్యవర్తిత్వం ద్వారా ప్రీసిట్టింగ్ లోక్ అదాలత్‌ను ప్రతి రోజు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ వచ్చే నెల అనగా జూలై 27వ తేదీ నుంచి ఆగస్టు 3వ తేదీ వరకూ సుప్రీంకోర్టులో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని, ఈ లోక్ అదాలత్‌లో రాజీ యోగ్యమైన కేసులను గుర్తించి సంబంధిత కోర్టుల ద్వారా నోటీసులు జారీ చేస్తారన్నారు. కక్షిదారులు ఈ నోటీసులు తీసుకుని జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో నిర్వహించే ప్రీలోక్ అదాలత్ సిట్టింగ్‌లకు హాజరై కేసులను రాజీ చేసుకోవాల్సిందిగా కోరారు. దీని ద్వారా సమయం, డబ్బు వృథా కాకుండా సత్వర న్యాయం పొందవచ్చన్నారు.

వేటకు వేళాయె

- నేటి అర్ధరాత్రి నుంచి సముద్రంలో వేట
- ముగిసిన వేట నిషేధ కాలం గడువు
- కోటి ఆశలతో వేట ప్రారంభానికి సన్నాహాలు
- 61 రోజులు ఖాళీగా మత్స్యకారులు



సముద్రంలో వేట కోసం ఐలు వలను సిద్ధం చేస్తున్న మత్స్యకారులు (ఫైల్)

నరసాపురం: సముద్రంలో వేట నిషేధకాలం గడువు శుక్రవారం అర్ధరాత్రితో ముగుస్తుండటంతో 61 రోజుల పాటు ఖాళీగా ఉన్న గంగపుత్రులు మళ్లీ సముద్రంలోకి వేటకు వెళ్లేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. గత ఏడాది తరచూ తుపాన్ల వంటి ప్రకృతి విపత్తులతో వేట సవ్యంగా సాగలేదు. ఏడాది పొడవునా మత్స్యకార్మికులు నష్టాలే చవిచూశారు. ఈ ఏడాదైనా ప్రకృతి కరుణించాలని ఏడాది కాలమంతా వేట ముమ్మరంగా సాగాలని గంగమ్మను వేడుకుంటున్నారు మత్స్యకారులు. చేపల పునరుత్పత్తి సీజన్ కావడంతో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా సముద్రంలో వేట నిషేధం అమలు చేస్తుంది. ప్రతి ఏటా ఏప్రిల్ 14 నుంచి జూన్ 15వ తేదీ వరకు వేటపై నిషేధం అమలులో ఉంటుంది. ఈ 61 రోజులు మత్స్యకారులు ఖాళీగా ఉంటారు. శుక్రవారం రాత్రి 12 గంటలు దాటిన తరువాత మత్స్యకారులు సముద్రంలోకి ప్రవేశించవచ్చు.

ప్రకృతి కరుణించాలని..

పశ్చిమగోదావరి జిల్లాలో 19 కిలోమీటర్లు మేర తీర ప్రాంతం ఉన్న నరసాపురంలో ప్రతి రోజూ జోరుగా వేట సాగుతుంది. నెల్లూరు, విశాఖ, మచిలీపట్టణం తదితర జిల్లాలకు చెందిన బోట్లు ఇక్కడ నిత్యం సముద్రంలో వేటసాగిస్తాయి. ప్రస్తుతం రెండు నెలల నుంచి సముద్రంలో వేట విరామం ఉండటంతో మత్స్యసంపద పుష్కలంగా ఉంటుంది. సముద్రంలో మత్స్యకారుల వలలకు మత్స్యసంపద పెద్ద మొత్తంలో దొరుకుతుంది. అయితే ప్రకృతి విపత్తుల రూపంలో మత్స్యకారులకు కష్టాలు కూడా దాగి ఉన్నాయి. సరిగ్గా ఇదే సమయంలో తుపాన్లు, అల్పపీడనాలు ఎక్కువగా ఉంటాయి. సముద్ర గర్భం అకస్మాత్తుగా అల్లకల్లోలంగా మారుతుంటుంది. అప్పటికప్పుడు తుపాను హెచ్చరికలతో వేటకు వెళ్లిన బోట్లు అప్పటికప్పుడు వెనక్కు తిరిగి రావాల్సి ఉంటుంది. అందుకే ప్రకృతి కరుణించాలని పెద్ద ఎత్తున వేట సాగాలని మత్స్యకారులు గంగమ్మతల్లికి పూజలు చేసి వేట ప్రారంభిస్తారు.

రక్తదానం.. మహోన్నతం

- రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి
- ఏలూరు రెడ్‌క్రాస్ సేవలు భేష్
- ఏడాదికి 2,912 యూనిట్ల సేకరణ
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం



ఏలూరులో రక్తదాన శిబిరం (ఫైల్)

ఏలూరు టౌన్: అన్ని దానాల్లో రక్తదానం గొప్పది. సకాలంలో రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. మనమిచ్చే రక్తం మరొకరి ప్రాణం కాపాడుతుంది. ప్రమాదాల్లో చనిపోతున్న వారు కొందరైతే, తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చేరి రక్తం అందక చనిపోతున్నవారు ఎక్కువ మందే ఉన్నారు. క్షతగాత్రులు, గర్భిణులు, వ్యాధులతో బాధపడేవారు, ఆపదలో ఉన్నవారికి రక్తాన్ని దానం చేయడం ద్వారా పునర్జన్మను ప్రసాదించేనట్లే. ఈ క్రమంలో జిల్లాలో రక్తదానం ఆవశ్యకత పెరుగుతుంది. పలువురు తరచుగా రక్తదానం చేస్తూ జీవ ప్రదాతలుగా నిలుస్తున్నారు. ఏలూరు జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ ఏడాదికి సుమారు 2,912 యూనిట్ల రక్తాన్ని సేకరిస్తోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రెడ్‌క్రాస్‌తో పాటు ప్రభుత్వ బ్లడ్ బ్యాంకులు ఉన్నాయి.

కుటుంబమంతా ప్రాణదాతలే..



ఏలూరుకి చెందిన బావిశెట్టి చిరంజీవి వ్యవసాయం చేస్తుంటారు. ఆయన ఇప్పటివరకు 105 సార్లు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. ఆయన భార్య, ముగ్గురు కుమారులు సైతం 35 సార్లుకు పైగా రక్తదానం చేశారు. ఆయన గత 30 ఏళ్లుగా రక్తదానం చేస్తున్నారు. తొలిసారి ఆయన బంధువుల అబ్బాయి రహదారి ప్రమాదానికి గురికావటంతో భయపడుతూ రక్తం ఇచ్చానని.. రక్తదానంతో ప్రాణాలు కాపాడటం ఎంతో ఆత్మ సంతృప్తి ఇచ్చిందని ఆయన అంటున్నారు. అప్పటి నుంచి క్రమం తప్పకుండా రక్తదానం చేస్తూనే ఉన్నానని గర్వంగా చెబుతున్నారు.

–బావిశెట్టి చిరంజీవి, ఏలూరు (105 సార్లు రక్తదాత)

మా అన్న.. మాకు ఆదర్శం



ఏలూరుకు చెందిన కానుకొల్లు రాజేష్ కుమార్ భీమడోలులో బోటనీ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ఆయన సోదరుడు సతీష్ కుమార్ బీఎస్ఎఫ్ జవాన్‌గా కాశ్మీర్ సరిహద్దుల్లో పనిచేస్తూ మిలిటెంట్లతో పోరాటంలో వీర మరణం పొందారు. ఆయన స్ఫూర్తితో రక్తదానం చేస్తూ యువతను చైతన్యవంతులను చేస్తూ రాష్ట్రస్థాయి రక్తదాతల వలంటరీ వాట్సాప్ గ్రూప్‌ను సైతం నిర్వహిస్తున్నారు. తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స అత్యవసరం కాగా వారి ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. పలువురికి రక్తదానం చేసి ఆదర్శంగా నిలుస్తున్నారు.

–కానుకొల్లు రాజేష్‌కుమార్, లెక్చరర్, ఏలూరు (94 సార్లు రక్తదాత)

చైతన్యవంతం చేసేలా..

- ఏలూరు జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ, ఏలూరు జీజీహెచ్ బ్లడ్ బ్యాంకును నిర్వహిస్తున్నాయి.
- రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో తణుకు, నరసాపురంలో బ్లడ్ బ్యాంకులు సేవలందిస్తున్నాయి.
- భీమవరంలో రెడ్‌క్రాస్ కాంపోనెంట్ బ్లడ్ బ్యాంకు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.
- భీమడోలు, దెందులూరు, చింతలపూడి, కైకలూరులో ప్రభుత్వ బ్లడ్ స్టోరేజ్ పాయింట్లు ఉన్నాయి.
- ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడుల్లో ప్రభుత్వ బ్లడ్ బ్యాంకులు ఉన్నాయి.

జిల్లాలో ఏడాదికి అవసరమైన రక్తం సుమారు 4 వేల యూనిట్లు

ఏడాదిలో సేకరిస్తున్న రక్తం 2,912 యూనిట్లు

తలసేమియా బాధితుల కోసం 969 యూనిట్ల వినియోగం

ఏలూరు రెడ్‌క్రాస్ సొసైటీ రక్తదాన శిబిరాలు 40

నెగిటివ్ గ్రూపు రక్తదాతలు అవసరం



జిల్లావ్యాప్తంగా రక్తదాతలు అందిస్తున్న సహకారం ఎంతో గొప్పది. వారి సేవలను ప్రతి ఒక్కరూ అభినందించాలి. ఇటీవల నెగిటివ్ బ్లడ్ గ్రూపునకు సంబంధించి రక్తదాతలు తక్కువగా ఉండటంతో చాలామంది ఇబ్బంది పడుతున్నారు. నెగిటివ్ బ్లడ్ గ్రూపు రక్తదాతలు స్పందించి రక్తదానాన్ని చేయాలని కోరుతున్నాం. తలసేమియా బాధితులకు నిత్యం అండగా నిలబడుతున్నాం.

–బీవీ కృష్ణారెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్

క్లుప్తంగా

మావుళ్లమ్మ సన్నిధిలో కేంద్ర సహాయమంత్రి


కేంద్రమంత్రి వర్మకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్) : శ్రీమావుళ్లమ్మ అమ్మవారిని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ గురువారం దర్శించుకున్నారు. ముందుగా ఆయనకు ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్న శ్రీనివాసవర్మకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ద మహాలక్ష్మి నగేష్ ఆయనకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు అర్చకులు పాల్గొన్నారు.

కేన్సర్ స్క్రీనింగ్ అవగాహన తరగతులు


శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డి.మహేశ్వరరావు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం, నరసాపురం, తణుకు మెడికల్ ఆఫీసర్లకు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లకు, ఏఎన్ఎంలకు గురువారం భీమవరం ఏరియా ఆసుపత్రిలో కేన్సర్ స్క్రీనింగ్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. నోడల్ ఆఫీసర్ డాక్టర్ నరేష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి మహేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు కేన్సర్‌పై అవగాహన కల్పించి తద్వారా వ్యాధిబారిన పడ్డవారిని గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం మోనిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ ధనలక్ష్మి, ఆసుపత్రి సూపరింటెండెంట్ మాధవి కళ్యాణి, డాక్టర్ గులాబ్ రాజ్‌కుమార్, డాక్టర్ సింది ఆనంద్, డాక్టర్ అబ్దుల్ హమీద్ తదితరులు పాల్గొన్నారు.

రజకుల సమస్యలపై నూతన ప్రభుత్వం దృష్టిపెట్టాలి


డ్వామా పీడీ ఏ.రాముకి వినతిపత్రం అందజేస్తున్న కట్లయ్య తదితరులు

ఏలూరు (టూటౌన్): రజకుల సమస్యల పరిష్కారానికి నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక సంఘం అధ్యక్షులు చిలకలపల్లి కట్లయ్య కోరారు. జంగారెడ్డిగూడెం లక్కవరం గ్రామంలోని రజకుల చెరువు సమస్యపై ఏలూరు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ ఏ.రామును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కట్లయ్య మాట్లాడుతూ జిల్లాలో రజకుల వృత్తి చెరువులు పూడికలతో నిండి నీరులేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా చెరువులను పూర్తిస్థాయిలో బాగుచేయాలని కోరారు. గతంలో టీడీపీ ప్రభుత్వం రజకుల వృత్తి చెరువుల మోటారు విద్యుత్ కనెక్షన్‌లకు ఉచిత విద్యుత్ కోసం విడుదల చేసిన జీవో నెం.75ను అమలు చేయాలని కోరారు. కులంపేరుతో రజకులను కించపరిచేలా వ్యవహరిస్తున్న వారిపై జీవో నెం.38 ప్రకారం చట్టపరంగా చర్యలను క్షేత్ర స్థాయిలో పోలీసులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి పంచాయతీ రాజ్ కమిషనర్ సుధాకర్ రజకులకు ఒకసారి ఇచ్చిన చెరువు ఎవ్వరూ మార్చకూడదని ఇచ్చిన ఆదేశాలు అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కిలంతరావుల కృష్ణ, వితాల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కొమ్మటి మురళి, జువ్వలపాలెం సత్యనారాయణ, దేవరపల్లి సుబ్బయ్య, జుజ్జువరపు శ్రీనివాసరావు, అమీనాపేట శేషు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఘర్షణ.. ఒకరి హత్య


కౌరు భాస్కరరావు మృతదేహం


ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న సీఐ నాగేశ్వరరావు, ఎస్సై చంద్రశేఖర్

తణుకు: మద్యం మత్తులో ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో ఒక వ్యక్తి హత్యకు గురయ్యాడు. తణుకు మండలం దువ్వ గ్రామంలోని ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెరవలి మండలం ముక్కామల గ్రామానికి చెందిన కౌరు భాస్కరరావు (40) గత నాలుగు నెలలుగా దువ్వ గ్రామంలో ఉంటున్నాడు. ఇటీవలి కాలంలో భార్యతో సఖ్యత లేకపోవడంతో నిత్యం మద్యం తాగుతూ ఇక్కడే ఉంటున్నాడు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం మద్యం తాగేందుకు దువ్వ గ్రామంలో ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద వచ్చాడు. ఈ నేపథ్యంలో అక్కడే మద్యం తాగుతున్న కాకి రామకృష్ణ, భాస్కరరావు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మోటారు సైకిల్‌పై వెళ్లిపోతున్న భాస్కరరావు ఛాతీ భాగంలో అక్కడే ఉన్న గాజుపెంకుతో రామకృష్ణ పొడిచాడు. అలాగే అక్కడి నుంచి వెళ్లిపోయిన భాస్కరరావు కొద్ది దూరం వెళ్లాక రోడ్డుపై పడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో బాధితుణ్ణి చికిత్స నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేలోపు మృతి చెందాడు. ఘటనా స్థలానికి తణుకు రూరల్ సీఐ జీవీవీ నాగేశ్వరరావు, ఎస్సై కె.చంద్రశేఖర్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నిందితుడు కాకి రామకృష్ణను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు భాస్కరరావుకు భార్య గంగాభవానీ, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి


శివనాగరాజు మృతదేహం

తణుకు: తణుకు రూరల్ మండలం తేతలి గ్రామ పరిధిలో బుధవారం రాత్రి ఒక యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాల ప్రకారం ఉండ్రాజవరం మండలం తాడిపర్రు గ్రామానికి చెందిన గాజులపాటి శివనాగరాజు (24) పైడిపర్రులోని గౌతమి స్పిన్నింగ్ మిల్లులో కార్మికుడిగా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి తేతలి నుంచి వడ్లూరు వెళ్లే రోడ్డులో పంట బోదెలో శవమై కనిపించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న రూరల్ ఎస్సై కె.చంద్రశేఖర్ వివరాలు సేకరించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు శివనాగరాజుకు భార్య శిరీష, ఏడాదిన్నర బాబు ఉన్నాడు. మోటారు సైకిల్‌పై వెళుతున్న శివనాగరాజు స్పీడ్ బ్రేకర్ తప్పించబోయి ప్రమాదవశాత్తూ పంటబోదెలో పడి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. అయితే ప్రమాదవశాత్తూ జరిగిందా లేక మరేదైనా కోణం ఉందా అని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాలికను వేధించిన వ్యక్తికి జైలు

చిలకలపూడి (మచిలీపట్నం): బాలికను వేధించిన కేసులో ముద్దాయికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి గాజుల వెంకటేశ్వర్లు గురువారం తీర్పు చెప్పారు. కలిదిండి మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన నారగాని అయ్యప్ప అదే గ్రామానికి చెందిన బాలికను వేధింపులకు గురిచేశాడు. ఈ విషయాన్ని బాలిక తన కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో వారు అయ్యప్పను మందలించారు. అయినప్పటికీ 2021 మే 22వ తేదీన బాలిక కిరాణా షాపునకు వెళ్లి వస్తుండగా ఆమె చేయి పట్టుకుని లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు. బాలిక కేకలు వేయటంతో స్థానికులు రాగా మద్యం తాగిన అయ్యప్ప వారిని భయపెట్టాడు. ఈ ఘటనపై బాలిక తల్లి 2021 మే 25వ తేదీన కలిదిండి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ కేసుపై పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముంజులూరు వెంకట మహేష్ కుమార్ ఎనిమిది మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

అగ్నిప్రమాదంలో రెండు తాటాకిళ్లు దగ్ధం

కొయ్యలగూడెం: అంకాలగూడెం గ్రామంలో గురువారం సంభవించిన అగ్నిప్రమాదంలో రెండు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. పాత దళిత పేటకు చెందిన సొంగా శేఖర్ బాబు ఇంటిలో మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో అగ్నిప్రమాదం సంభవించి ఆ వెంటనే పక్కనే ఉన్న దమ్మిసిల్లి నాగశ్రీను ఇంటికి మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో ఇళ్లలో ఎవరూ లేకపోవడంతో స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. జంగారెడ్డిగూడెం నుంచి అగ్ని మాపక వాహనం వచ్చి మంటలను అదుపు చేసేసరికే రెండు ఇళ్లు పూర్తిగా దగ్ధం అయ్యాయి. దీంతో సొంగా శేఖర్ బాబు, దమ్మిసిల్లి నాగశ్రీను కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. ఒక్కొక్క కుటుంబానికి సుమారు రూ.లక్ష మేర నష్టం సంభవించిందని అగ్నిమాపక అధికారులు తెలిపారు. కాగా ఈ ప్రమాదానికి గల కారణాలు మాత్రం తెలియరాలేదు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు

ఆగిరిపల్లి: ఆర్టీసీ బస్సు ఢీకొని ఎన్ఆర్ఐ కళాశాల చెందిన ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. విజయవాడకు చెందిన సంపంగి ఈశ్వరరావు ఎన్ఆర్ఐ కళాశాలలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. గురువారం ఉదయం విజయవాడ నుంచి ఈశ్వరరావు, అతని మిత్రుడు బైక్‌పై కళాశాలకు వెళ్తుండగా అడవినెక్కలం వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు విద్యార్థుల బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థుల ఫిర్యాదు మేరకు ఎస్సై సురేంద్ర కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టాటా ఏస్ ఢీకొని వ్యక్తికి గాయాలు

చాట్రాయి: ద్విచక్రవాహనాన్ని టాటా ఏస్ వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. మండలంలోని కోటపాడు గ్రామానికి చెందిన సాయిబాబా గురువారం మధ్యాహ్నం తన ద్విచక్రవాహనంపై చాట్రాయి వస్తుండగా బూరుగుగూడెం గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న టాటా ఏస్ వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని 108 వాహనం ద్వారా నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

చినవెంకన్న అంటే సెంటిమెంట్..

సినీ దర్శకుడు జ్ఞాన సాగర్


శ్రీవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న సినీ దర్శకుడు జ్ఞాన సాగర్

ద్వారకాతిరుమల: చినవెంకన్న అంటే తనకు ఎంతో సెంటిమెంట్ అని సినీ దర్శకుడు జ్ఞాన సాగర్ అన్నారు. ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయాన్ని గురువారం ఆయన కుటుంబ సమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితులు ఆయనకు వేద ఆశీర్వచనాన్ని, శ్రీవారి ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా జ్ఞాన సాగర్ మాట్లాడుతూ తన దర్శకత్వంలో సుధీర్‌బాబు హీరోగా నటించిన హరోం హర చిత్రం శుక్రవారం విడుదల కానుందన్నారు. అందుకే స్వామివారిని దర్శించుకున్నట్టు చెప్పారు. ఈ చిత్రం షూటింగ్ ప్రారంభానికి ముందు శ్రీవారిని దర్శించానని, మళ్లీ విడుదలను పురస్కరించుకుని ఇక్కడకు వచ్చానన్నారు. చినవెంకన్న ఎంతో మహిమాన్వితుడని, ఆయనను దర్శించిన ప్రతిసారి తనకు మంచి జరుగుతుందన్నారు. స్వామివారిని దర్శించి, ఆశీస్సులు పొందడం సంతోషాన్ని కలిగించిందని చెప్పారు.

రేపటినుంచి వరాల వెంకన్న బ్రహ్మోత్సవాలు



అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీవరాల వేంకటేశ్వరస్వామివారి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు ఈనెల 15 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల వెంకట నారాయణరావు, ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు తెలిపారు. 15న ఉదయం శ్రీవరాల వేంకటేశ్వరస్వామివారిని పెండ్లికుమారునిగా, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను పెండ్లికుమార్తెలుగా చేస్తారని, 16న హనుమాన్ చాలీసా పారాయణం, గజవాహన సేవ, రాత్రి శ్రీస్వామివారి కల్యాణోత్సవం, 17న తీర్థ మహోత్సవం, అఖండ అన్నసమారాధన, రథోత్సవం, 18న సింహవాహనసేవ, శ్రీవేంకటేశ్వర సంబరం, 19న సుదర్శన హోమం, గరుడవాహనసేవ, 20న శేషవాహన సేవ, 21న శ్రీవారి చక్రస్నాన కార్యక్రమాలు జరుగుతాయని వారు తెలిపారు. భక్తులు శ్రీస్వామివారి కల్యాణ మహోత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

పారితోషికం చెల్లించాలని వీడియోగ్రాఫర్ల నిరసన


చింతలపూడి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వీడియోగ్రాఫర్లు

చింతలపూడి: చింతలపూడి నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించిన వీడియోగ్రాఫర్లకు పూర్తి పారితోషికం చెల్లించకపోవడంపై తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 20 మంది వీడియోగ్రాఫర్లు ఎలక్షన్ విధుల్లో పాల్గొన్నామని, అప్పట్లో రెవెన్యూ కార్యాలయం ద్వారా కొంత నగదు అడ్వాన్సుగా ఇచ్చినట్లు తెలిపారు. కాగా మిగిలిన మొత్తాన్ని ఇంత వరకు ఇవ్వలేదన్నారు. రెండు రోజుల క్రిందట తమకు సంబంధించిన పారితోషికం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చినట్టు తెలిసిందని, అయితే దీనిపై తహసీల్దార్ స్పష్టత లేని సమాధానాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమకు రావాల్సిన పారితోషికాన్ని పూర్తిగా అందజేయాలని వీడియోగ్రాఫర్లు కోరారు. కార్యక్రమంలో వీడియోగ్రాఫర్‌లు కుమార్, ఆనంద్, నరేష్, రాజు, జిన్న, రామకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.


స్థానిక సంస్థలతో సుపరిపాలన

ఏలూరు రూరల్: రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యక్రమం కింద స్థానిక ప్రభుత్వాల ద్వారా సుపరిపాలన అందించడమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ కన్సల్టెంట్ రుచియా దవ్ అన్నారు. ఏలూరులోని జిల్లా వనరుల కేంద్రాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌ల ప్రజాప్రతినిధులు, అధికారులకు గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యక్రమాలపై అవగాహన, శిక్షణ కల్పిస్తున్నామన్నారు. స్థానిక సంస్థల ప్రతినిధులకు శక్తి సామర్థ్యాలు, నాయకత్వ పటిమ పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం వనరుల కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను జెడ్పీ సీఈఓ కేఎస్ఎన్ సుబ్బారావు ఆమెకు వివరించారు. హాస్టల్ గదుల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. జిల్లా ట్రైనింగ్ మేనేజర్ జి.ప్రసంగిరాజు, రాష్ట్ర ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ శ్రీనాథ్, ప్రోగ్రామ్ అధికారి ఎస్.మోహనరావు ఉన్నారు.

సేంద్రియ సాగు పద్ధతులే మేలు

- విచక్షణా రహితంగా రసాయన ఎరువుల వాడకంతో అనర్థం
- పోషకాలు లోపించి తగ్గుతున్న దిగుబడులు
- సేంద్రియ సాగు చేపట్టాలని రైతులకు అధికారుల సూచన


మెట్ట ప్రాంతంలో రైతులు పండిస్తున్న వేరుశనగ పంట (ఫైల్)



చింతలపూడి: ప్రస్తుతం రైతులు తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటను పండించడానికి విచక్షణారహితంగా రసాయన ఎరువులు వాడుతున్నారు. ఫలితంగా భూముల్లో పంటలకు కావలసిన పోషకాలు అందుబాటులో లేక సమతుల్యత లోపించి ముందెన్నడూ లేని విధంగా ద్వితీయ సూక్ష్మ పోషక లోపాలు పంటల్లో కనిపిస్తుంది. ఈ పోషకాలు లోపించినప్పుడు సాగులో మిగతా యాజమాన్య పద్ధతులన్నీ సక్రమంగా పాటించకపోయినా దిగుబడులు తగ్గుతాయి. వీటిని అధిగమించడానికి సేంద్రియ వ్యవసాయ పద్ధతులు మేలని వ్యవసాయ సహాయ సంచాలకులు బి.నాగకుమార్ సూచిస్తున్నారు. చింతలపూడి సబ్‌డివిజన్ పరిధిలో ఏటా ఖరీఫ్ సీజన్‌లో 35,542 ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తుంటారు. ఇవి కాక 340 ఎకరాల్లో మొక్కజొన్న, 157 ఎకరాల్లో వేరుశనగ పంటలు పండిస్తారు. రబీ సీజన్‌లో సుమారు 1,500 హెక్టార్లలో వరి, 18,000 హెక్టార్లలో మొక్కజొన్న, 2,500 హెక్టార్లలో వేరుశనగ పంటలను రైతులు సాగు చేస్తుంటారు.

ఎరువుగా జిప్సం

జిప్సం రసాయన నామం. జిప్సంలో 24 శాతం కాల్షియం, 18 శాతం గంధకం ఉంటుంది. కాల్షియం, గంధకం మొక్కల పెరుగుదలకు అవసరమైన ద్వితీయ శ్రేణి పోషకాలను అత్యంత చౌకగా జిప్సం ద్వారా అందించవచ్చు. ముఖ్యంగా నూనె గింజలు, పప్పు ధాన్యాల వంటి పంటల్లో గంధకం ఆవశ్యకత అధికంగా ఉంటుంది. కాల్షియం మొక్కల్లోని జీవకణాల అంచులు గట్టిగా ఉండటానికి, కణ విభజనకు, వేర్ల అభివృద్ధికి గింజకట్టడానికి అవసరమవుతుంది. దీని వల్ల మొక్కలకు చీడపీడలను ఎదుర్కొనే శక్తి సమకూరుతుంది.

అధిక దిగుబడులు సాధించాలంటే...

వేరుశనగ పంటలో అధిక దిగుబడులకు జిప్సంను పూత దశలో వేసుకుని భూముల్లో కలియబెట్టడం వల్ల వేరుశనగ ఊడలు జిప్సంలోని కాల్షియం, గంధకాన్ని తీసుకుని అధిక దిగుబడులు వస్తాయి. వేరుశనగలో జిప్సం వినియోగం వల్ల కాయలు గట్టిగా ఉండి కాయ నిండా పప్పు వృద్ధి చెంది గింజల్లో అధిక నూనె శాతం కలిగి ఉంటుంది. ఫలితంగా కాయలు అధిక బరువు కలిగి మంచి ధర పలుకుతాయి. కాబట్టి పూత సమయంలో ఎకరాకు 200 కిలోల చొప్పున భూమిలో తగిన తేమ ఉన్నప్పుడు మొక్కలకు దగ్గరగా వేసుకోవాలి. బీడు, చౌడు భూముల్లో నీరు సరిగా ఇంకదు. గాలి ప్రసరణ తక్కువగా ఉంటుంది. భూమి భౌతిక లక్షణాలు క్షీణించి ఉంటాయి. ఈ పరిస్థితుల్లో మొక్కల వేర్లు సరిగా వృద్ధి చెందక మొక్కల్లో ఎదుగుదల ఉండదు. ఇలాంటి భూముల్లో జిప్సం వినియోగం వల్ల నేల గుల్లబారి భూమిలో నీరు ఇంకే స్వభావం పెరిగి మొక్కల వేర్లు బాగా వృద్ధి చెందుతాయి. పంట దిగుబడి గణనీయంగా పెరుగుతుంది.


సబ్ డివిజన్‌లో వ్యవసాయ బోర్ల క్రింద రైతులు వేసిన నారుమళ్లు

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



తాడేపల్లిగూడెంలోని గ్రేడ్-1 గ్రంథాలయం


గ్రంథాలయంలో చదువుకుంటున్న యువతీ యువకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): చదవరుల సమాచార అవసరాన్ని తీర్చడం కోసం గ్రంథాలయాలను అందరికి అందుబాటులో ప్రభుత్వాలు ఏర్పాటు చేశాయి. ప్రజలు తమ పరిజ్ఞానాన్ని పెంచుకునేందుకు, వారి పరిశోధనను పూర్తి చేయడానికి ఈ గ్రంథాలయాలను సందర్శిస్తారు. పాఠశాల విద్యార్థులు చిన్ననాటి నుంచే గ్రంథాలయాలను సందర్శించడం ద్వారా వారి జ్ఞాన అభివృద్ధితో పాటు, ఏకాగ్రత స్థాయి పెంచడంలోను, ఉన్నత విద్యకు, ఉపాధికి కూడా ఎంతగానో ఉపయోగపడతాయి. తాడేపల్లిగూడెం నడిబొడ్డున అన్ని సౌకర్యాలు, హంగులతో, మంచినీరు, ఫ్యాన్‌లు, ఫర్నీచర్‌లతో పాటు విశాలమైన ఖాళీ స్థలంలో ఆహ్లాదకరమైన పచ్చని పర్యావరణంతో గాలి, వెలుతురు ఉండే విధంగా గ్రేడ్-1 గ్రంథాలయంను ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తుంది. గ్రంథాలయాధికారితో పాటు ఔట్‌సోర్సింగ్ లైబ్రేరియన్ కూడా అందుబాటులో ఉన్నారు. వారపు శెలవు శుక్రవారం కాగా, ప్రభుత్వ సెలవులలో గ్రంథాలయంను మూసి వేస్తారు.

అందుబాటులో ఉన్న పుస్తకాలు

గ్రంథాలయంలో 42 వేల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. నవలలు, పిల్లల కథల పుస్తకాలు, పోటీ పరీక్షలైన బ్యాంక్ పరీక్షలకు, డీఎస్సీ, గ్రూపు 4 నుంచి గ్రూపు 1 వరకు, పాలిటెక్నిక్ పరీక్షలు, వైద్య సంబంధించిన పుస్తకాలు, తెలుగు అకాడమిక్ పుస్తకాలు, ఇంగ్లీషు నవలలు, గ్రామర్ బుక్స్, స్పోకెన్ ఇంగ్లీషు బుక్స్, డిక్షనరీలు, ఆధ్యాత్మిక పుస్తకాలు, సాహిత్యం, సాంకేతిక విజ్ఞాన విషయాలు, మతం, తత్వశాస్త్రాలు, వార, పక్ష, మాస పత్రికలు, విజేత కాంపిటీషన్ బుక్స్, స్వాతి, జాగ్రతి, విజ్ఞాన సూచిక, వివేక, షైన్ ఇండియా, జ్ఞాన సముపార్జనకు సంబంధించిన పుస్తకాలు, అందరికి ఆయుర్వేదం ఇంకా అనేక సాధారణ పుస్తక వనరులు అందుబాటులో ఉన్నాయి. అనేక ప్రముఖ తెలుగు, ఇంగ్లీషు న్యూస్ పేపర్లు, మేగజైన్లు, వివిధ రకాలైన పుస్తాకాలను ఉంచారు.


గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న యువకులు

కొత్త సభ్యత్వాలు: గ్రంథాలయం సభ్యత్వాలు 7,774 మందికాగా, రీడర్స్, సీనియర్ సిటిజన్స్, విశ్రాంత ఉద్యోగులు, ఎంప్లాయిస్, మహిళలు, యువత, విద్యార్థులు ప్రతి రోజు సుమారు 150 మంది చదవరులు గ్రంథాలయంకు వస్తారు. కొత్తగా సభ్యత్వం చేరాలంటే ప్రభుత్వ గుర్తింపు పొందిన కార్డు లేదా ఆధార్ కార్డు ఫొటోతో పాటు, సభ్యత్వ రుసుం రూ.100 చెల్లించాల్సి ఉంటుంది. సభ్యత్వం వదులుకుంటే వెనక్కి రూ.100 ఇచ్చేస్తారు. 14 రోజుల కాల పరిమితితో కొన్ని రకాల పుస్తకాలను ఇంటికి ఇస్తారు. అవి తిరిగి తెచ్చిన తర్వాత మరో పుస్తకం తీసుకువెళ్లవచ్చు.

గ్రంథాలయాలను సందర్శించాలి



చిన్న నాటి నుంచే విద్యార్థులు చక్కని చదువులు చదవడంతో పాటు గ్రంథాలయాలను సందర్శించాలి. ఆ దిశగా తల్లిదండ్రులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలి. స్కూల్‌లో ఖాళీ పీరియడ్స్ ఉన్న సమయంలో విద్యార్థులను గ్రంథాలయాలకు తీసుకువచ్చే విధంగా చూడాలి.

– వి.శ్రీనివాసరావు,
గ్రేడ్-1 గ్రంథాలయాధికారి, తాడేపల్లిగూడెం

జ్ఞాన సముపార్జన చేసుకోవచ్చు



గ్రంథాలయాలకు రావడం వల్ల ప్రామాణికమైన నమ్మదగిన సమాచారాన్ని అందిస్తాయి. పిల్లలు జ్ఞాన సముపార్జన చేసుకోవచ్చు. ప్రతి రోజు ముందు రోజు జరిగిన సమాచారం సులువుగా తెలుసుకోవచ్చు. పుస్తకాలు కొనుగోలు చేయలేని వ్యక్తులు గ్రంథాలయాల నుంచి పుస్తకాలు తీసుకోవచ్చు. సొమ్ములు ఆదా, ఉచితంగా సమాచారాన్ని పొందవచ్చు. యువత పోటీ పరీక్షలకు ప్రిపేర్ కావచ్చు. జాబ్స్ వచ్చేందుకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.

– సీహెచ్ వెంకటరత్నం, రీడర్, తాడేపల్లిగూడెం

వర్షపు నీటిని ఒడిసి పట్టాలి


ఇంకుడు గుంతల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరిస్తున్న ఎంఈవో వి.హనుమ

తాడేపల్లిగూడెం రూరల్: వర్షపు నీరు వృథా కాకుండా నిల్వ చేసి, వాటిని వినియోగించుకోవాలని ఎంఈవో వి.హనుమ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని మోదుగ గుంట, అప్పారావుపేట, మాధవరం, దండగర్ర ఉన్నత పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమం, ఇంకుడు గుంటల ప్రాముఖ్యతను గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఎంఈవో హనుమ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద ఇంకుడు గుంతలు తవ్వుకోవాలని సూచించారు. వర్షపు నీరు ఈ ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి చేరుతుందన్నారు. తద్వారా జల వనరులను పరిరక్షించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, శివకుమార్, చంద్రశేఖర్, సీఆర్పీ బత్తుల నానిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని హౌసింగ్ బోర్డు సబ్ స్టేషన్, కొండయ్య చెరువు సబ్ స్టేషన్, పాతూరు సబ్ స్టేషన్, జువ్వలపాలెం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు, విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్లు కొమ్మలను నరికే నిమిత్తం ఈ నెల 14వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. వన్ టౌన్‌లోని అన్ని ప్రాంతాలలోను, టూ టౌన్‌లోని జువ్వలపాలెం, సవిత్రుపేట, మార్కెట్ ఏరియా, తణుకు రోడ్డు ఏరియా, కొత్తగూడెం, నవ్వారుపేట, బైపాస్ రోడ్డు, ఏలూరు రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ ఉండదని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు


వాసవి ఆలయంలో సూర్యనారాయణ స్వామి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ఏలూరు రోడ్డులో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో జేష్టమాసం సప్తమి గురువారం సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. తొలుత గణపతి పూజ, అనంతరం సూర్యనారాయణ స్వామి మూల విరాట్‌కు పంచామృతాలతో, సుగంధ ద్రవ్యాలు, ఫలరసాలతో అభిషేకాలు జరిగాయి. ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి నున్న బాల త్రిపుర సుందరరావు దంపతులు, పేరూరి కాశియ్య దంపతులు పూజలలో పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ఘనంగా మహా రుద్రయాగం


మహా రుద్రయాగంలో పాల్గొన్న దంపతులు, అర్చకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక శంకరమఠంలో శ్రీ ఉమా చంద్రమౌళీశ్వర స్వామివారికి, సర్వ మంగళ అమ్మవారికి దేవస్థానం పవిత్రోత్సవాలు సందర్భంగా విశేష పూజలు జరిగాయి. గురువారం మహారుద్రయాగం నిర్వహించారు. ఆదిశంకరాచార్యకు అర్చనలు, చంద్రమౌళీశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి విశేష కుంకుమార్చనలు జరిగాయి. ప్రయాగ కిషోర్, జ్యోశ్యుల పాండురంగ శాస్త్రిలు మాట్లాడుతూ ఐదు రోజుల పాటు జరిగే క్రతువులలో సుందరకాండ, శత రుద్రీయ పారాయణం, రుద్రహవనం, అన్నసమారాధనలు నిర్వహిస్తామని వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బడికి విద్యార్థులు


సంజీవనగర్ ప్రాథమిక పాఠశాలకు హాజరైన విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవి సెలవులు అనంతరం గురువారం పట్టణంలోని పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. వాతావరణం అనుకూలంగా ఉండటంతో విద్యార్థులు పాఠశాలలకు ఉల్లాసంగా, ఉత్సాహంగా రావడం కన్పించింది. విద్యార్థుల రాకతో పాఠశాలలు కళకళలాడాయి. అదే విధంగా రోడ్లపై విద్యార్థులు హడావిడి కన్పించింది. మండలంలో వంద పాఠశాలలకు గాను యాబై పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లు, నోట్ పుస్తకాలు అందజేశారు.

ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు అభినందనలు


ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు అభినందనలు చెబుతున్న లయన్స్ క్లబ్, పేరిచర్ల ఫౌండేషన్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ను ఆయన నివాసం వద్ద గురువారం పేరిచర్ల ఫౌండేషన్ చైర్మన్ మురళీకృష్ణంరాజు, లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ అధ్యక్షుడు కొప్పిశెట్టి రమణయ్య, క్లబ్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీనివాస్‌కు శాలువ కప్పి, పుష్పగుచ్ఛాలతో అభినందనలు, శుభాకాంక్షలు చెప్పారు. క్లబ్ సభ్యులు కాళ్ళ గోపికృష్ణ, చెన్నారెడ్డి సతీష్, జోన్నల సతీష్‌కుమార్, పట్నాల రామకృష్ణ, కె.కృష్ణకాంత్, ఆరేపల్లి ఉమా మహేశ్వరరావు, మృత్యుంజయకుమార్, పల్లెల శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయం, పౌల్ట్రీ రంగాలకు అండగా నిలబడ్డాం


తణుకులో ట్రాఫిక్ బారికేడ్లు ప్రారంభిస్తున్న సెంట్రల్ బ్యాంక్ జోనల్ హెడ్ దారాసింగ్ నాయక్ తదితరులు

తణుకు అర్బన్: ఖాతాదారులకు సత్వర సేవలందించడమే కాకుండా సేవా కార్యక్రమాల్లోను సెంట్రల్ బ్యాంకు ముందువరసలోనే ఉందని సెంట్రల్ బ్యాంక్ జోనల్ హెడ్ దారాసింగ్ నాయక్ అన్నారు. గురువారం తణుకు సెంట్రల్ బ్యాంకును పరిశీలించిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత మూడేళ్ల కాలంలో సెంట్రల్ బ్యాంకు సేవలు, వ్యాపారంలో మంచి పురోగతి సాధించినట్లు చెప్పారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటకకు సంబంధించిన జోనల్‌లో 7 రీజియన్‌లలోను 336 బ్రాంచ్‌లు ఉన్నాయని, ఇందులో భాగంగా విజయవాడ రీజియన్‌లో తమ బ్యాంకులు మంచి గ్రోత్ సాధించాయని రూ. 4,500 కోట్లు వ్యాపారం చేశామని స్పష్టం చేశారు. డిపాజిట్‌లు తక్కువగా సేకరించినప్పటికీ వ్యవసాయం ఇతర రంగాలకు అధికశాతం రుణాలు అందించి నూటికి 216 రేషియోలో సేవలందిస్తున్నామని చెప్పారు. తణుకు బ్రాంచ్ అన్ని రకాల బ్యాంకు విధుల్లోను ముందువరసలో ఉండగా ఈ శాఖలో 275 కోట్లు వ్యాపారం జరిగిందని అందులో ముఖ్యంగా వ్యవసాయం, పౌల్ట్రీలకు సంబంధించి 60 శాతం వరకు రుణాలు అందజేశామని చెప్పారు. అంతేకాకుండా రైస్ మిల్లర్స్, గోల్డ్ లోన్స్ ద్వారా ఖాతాదారులకు అండగా నిలిచినట్లు స్పష్టం చేశారు. పౌల్ట్రీ రంగంలో ఇటీవల సంభవించిన నష్టాలకు అనుగుణంగా రైతాంగానికి సెంట్రల్ బ్యాంకు పూర్తి సహకారం అందజేశామని తెలిపారు. మా బ్యాంకుపై ఎటువంటి ఫిర్యాదులు, సలహాలు ఇవ్వాలన్నా ఖాతాదారులు, ప్రజానీకం 18003030 నెంబరులో సంప్రదించవచ్చని సూచించారు.

ట్రాఫిక్ వేగ నియంత్రణ బోర్డులు అందచేత

సోషల్ సర్వీస్ యాక్టివిటీస్‌లో భాగంగా సెంట్రల్ బ్యాంక్ అందచేసిన సహకారం అభినందనీయమని తణుకు రూరల్ సీఐ నాగేశ్వరరావు అన్నారు. తణుకు సెంట్రల్ బ్యాంక్ యాజమాన్యం సౌజన్యంతో సమకూర్చిన వేగనియంత్రణ, ట్రాఫిక్ డైవర్షన్ తదితర అవసరాలకు ఉపయోగించే 15 బారికేడ్స్ బోర్డులు సెంట్రల్ బ్యాంక్ జోనల్ హెడ్ దారాసింగ్ నాయక్ చేతులమీదుగా సీఐ నాగేశ్వరరావు అందుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఖాతాదారులకు మంచి సేవలు అందించడమే కాకుండా సేవా కార్యక్రమాల్లోను సెంట్రల్ బ్యాంకు ముందుండడం మంచి పరిణామమన్నారు. తణుకు రాష్ట్రపతి రోడ్డు, వేల్పూరు రోడ్డు, ఉండ్రాజవరం రోడ్డు తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు బారికేడ్లు చాలా సద్వినియోగపడతాయని అన్నారు. తణుకు బ్రాంచి మేనేజరు వి.ఆనందరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో విజయవాడ రీజియన్ హెడ్ పి.సతీష్‌బాబు, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఏఎస్ఐ గోపీనాథ్ తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పట్టింపాలెం గ్రామానికి చెందిన కాసగాని రాంబాబు పెద్ద కుమార్తె సంధ్య తన పుట్టిన రోజు నిమిత్తం అత్తవారిల్లు దొమ్మేరు నుంచి ఈ నెల 10వ తేదిన ఆమె పుట్టింటికి వచ్చింది. ఈ నెల 12వ తేది తెల్లవారు జామున రాంబాబు భార్య లేచి చూసే సరికి సంధ్య కనిపించకపోవడంతో చుట్టుపక్కల గాలించారు. ఆచూకీ కానరాకపోవడంతో గురువారం ఆమె తండ్రి కాసగాని రాంబాబు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయనిచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై వి.గోపీనాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మానవత సేవలు అభినందనీయం


తణుకులో మహిళకు కుట్టు మిషన్ అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

తణుకు టౌన్: మానవత సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. బ్యాగులు కుట్టుకుని జీవనోపాధి పొందుతున్న మహిళకు తణుకు మానవత సంస్థ రూ. 11 వేల విలువైన కుట్టు మిషన్‌ను బహూకరించారు. గురువారం సాయంత్రం తణుకు రోటరీ క్లబ్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మానవత సంస్థ సభ్యురాలు వంగూరి సుశీల ఆర్థిక సహాయంతో తణుకు పట్టణంలోని మసీదు వద్ద బ్యాగులు కుట్టుకుని జీవిస్తున్న షేక్ ఆస్కరీ జహాన్‌కు మానవత సంస్థ సభ్యురాలు వంగూరి సుశీల ఆర్థిక సహాయంతో బ్యాగులు కుట్టే మిషన్‌ను అందజేశారు. ఈకార్యక్రమంలో మానవత శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, తణుకు శాఖ అధ్యక్షుడు ఏ బాలాజీ, కన్వీనర్ ఎస్వీ సతీష్ బాబు, ఉపాధ్యక్షురాలు కఠారి శారదాదేవి, వంగూరి హనుమంతరావు, విశ్వనాధ రాజు, పాతూరి శివనారాయణ, రామకృష్ణంరాజు, బీ రామకాశీ, పులమాల వీరభద్రం, కేవీ రమణ మూర్తి, పోతుల శ్రీనివాసు, అక్కిన కాశీవిశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన క్రిస్టియన్ మైనార్టీ ప్రతినిధులు


మంగళగిరిలో సీఎం చంద్రబాబును కలిసి అభినందనలు తెలిపిన బిషప్ కె. రత్నరాజు, తదితరులు

పెంటపాడు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌లను గురువారం మంగళగిరిలో రాష్ట్ర టీడీపీ, జనసేన క్రిస్టియన్ మైనారిటీ సంఘ ప్రతినిధులు కలిసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర సుభిక్షం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆ వివరాలను టీడీపీ, జనసేన క్రిష్టియన్ పశ్చిమగోదావరి జిల్లా సంఘ అధ్యక్షుడు బిషప్ కె. రత్నరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్డీఏ కూటమి ద్వారా ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలు ప్రజలతో పాటు, క్రైస్తవులు అందరికీ అందేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ మైనారిటీ సంఘ ఆయా జిల్లాల ప్రతినిధులు కుంపట్ల ప్రసాద్, బిషప్ నక్కా ఆనందకుమార్, అడపా ప్రసాద్, బిషప్ తలసిల పరిశుద్ధబాబు, బిషప్ ఎస్ ఇస్సాకు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలి



భీమవరంలో విలేకర్లతో మాట్లాడుతున్న బలరామ్

భీమవరం: రైతులు ప్రభుత్వానికి విక్రయించిన ధాన్యం బకాయిలను వెంటనే చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్ డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ దాళ్వా మాసూళ్ళ సొమ్ము రైతులకు రూ.900కోట్లు చెల్లించాల్సి ఉందని గత సార్వా సొమ్ములు కూడా బకాయిలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యం విక్రయించిన సన్న, చిన్నకారు, మధ్యతరగతి రైతులు నెలల తరబడి ధాన్యం సొమ్ము అందక బయట వడ్డీలకు అప్పులకు తెచ్చి సాగు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి బకాయిల సొమ్మును వడ్డీతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. శివారు భూములకు సైతం నీరు అందేలా చూడాలని బలరామ్ డిమాండ్ చేశారు.

గోవధ నిషేధంపై అవగాహన అవసరం

పెంటపాడు: పశువుల అక్రమ రవాణా, గోవధ నిషేధం పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డివిజన్ పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ కేఎల్ సుధాకర్ పేర్కొన్నారు. గురువారం ఆయన డివిజన్ పరిధిలోని వెటర్నరీ సిబ్బందితో అవగాహన సమావేశం పెంటపాడులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ పశువుల అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధానంగా గోమాసం విక్రయం, పశువుల రవాణా విషయంలో ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ఈ విషయంపై సిబ్బంది గ్రామ స్థాయిలో అవగాహన ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు పశువైద్యాధికారి డాక్టర్ మహేష్ సిబ్బంది పాల్గొన్నారు.

గోవధ నిషేధం

అత్తిలి: ఈనెల 17న బక్రీద్ పండుగ సందర్భంగా గోవధ చేసినా, గోవులను అక్రమ రవాణా చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె నరశింహారావు అన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు గోవధ నిషేద చట్టాన్ని తీసుకురావడంతో గోవధను కేంద్ర ప్రభుత్వం నిషేధించిందని చెప్పారు. తణుకు, అత్తిలి మండలాల ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

డిగ్రీ చదువుతున్న విద్యార్థి అదృశ్యం

భీమవరం: పట్టణంలోని మెంటేవారితోటకు చెందిన శృంగవరపు తులసీ రవి శంకర్ ఈ నెల 11 నుంచి కన్పించడం లేదుంటు ఫిర్యాదు అందినట్లు వన్‌టౌన్ హెడ్‌కానిస్టేబుల్ వై వెంకటేశ్వరరావు చెప్పారు. తులసీరవిశంకర్ పట్టణంలోని ఒక ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకువెళ్లి తిరిగిరాకపోవడంతో బంధువులు ఇళ్లు, చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకుపోవడంతో శివశంకర్ తండ్రి నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెంకటేశ్వరరావు చెప్పారు.

తండ్రి కనిపించడం లేదని కుమారుడి ఫిర్యాదు

భీమవరం: భీమవరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని చినపేటకు చెందిన రెడ్డి త్రినాథ్ కన్పించడం లేదని అతని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఏఎస్ఐ రామకృష్ణ గురువారం చెప్పారు. కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 6న త్రినాథ్ ఇంటి నుంచి బయట కు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ దొరక్కపోవడంతో త్రినాథ్ కుమారుడు పోలీసులను ఆశ్రయించాడు.

రెడీమేడ్ దుస్తులతో దర్జీలకు తగ్గుతున్న ఆదరణ

భీమవరం: రెడీమేడ్ వస్త్రాల వ్యవస్థలతో దర్జీ వృత్తికి క్రమేణా మసకబారుతోందని గాంధీ కస్తూరిబా ఆదర్శ మహిళ కేంద్రం కుట్టు శిక్షణ ఉపాధ్యాయిని దుర్గ రత్నమాల అన్నారు. శ్రీ విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో గాంధీ కస్తూరిబా ఆదర్శ మహిళ కేంద్రంలో గురువారం జాతీయ కుట్టు యంత్రం దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నమాల మాట్లాడుతూ కొన్నేళ్ల క్రితం శుభకార్యాలు, పండుగలు వస్తున్నాయంటే దర్జీలకు చేతినిండా పని ఉండేదని, పల్లెల్లో పట్టణాల్లో దర్జీలను ఎంతో ఆదరించేవారన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ దుర్గాబాయి దేశ్‌ముఖ్ స్థాపించిన ఆదర్శ మహిళా సంఘాల్లో భీమవరం గాంధీ కస్తూరిబా ఆదర్శ మహిళ కేంద్రం ఒకటని ఇక్కడ పదిహేనేళ్లుగా కుట్టు శిక్షణ అందిస్తున్నారన్నారు. భీమవరం పట్టణ టైలర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు శివకవి సాంబమూర్తి, కార్యదర్శులు త్రినాథ్, ఎన్ రామకోటేశ్వరరావు, దుర్గ రత్నమాల తదితరులను సత్కరించారు.